సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 19 : జూన్ : 2024



..అధికారులు ఏం చేస్తున్నట్లు?

కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అటవీ అధికారులు ఏం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 8లో



నేటి నుంచి రాష్ట్ర మహాసభలు

టీయూడబ్ల్యూజే - ఐజేయూ రాష్ట్ర మహాసభలు బుధ, గురువారాల్లో ఖమ్మంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 34° / 26°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



జడ్జికి మొక్క అందజేస్తున్న కలెక్టర్

కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఇరువురూ చర్చించారు.

సకాలంలో విధులకు హాజరుకాని సింగరేణి ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): మస్టర్ నమోదు చేసుకుని విధులు నిర్వర్తించని కొందరితో పాటు మధ్యాహ్న భోజనానికి వెళ్లి సకాలంలో తిరిగి రాని ఇంకొందరు ఉద్యోగులపై చర్యలు తీసుకునేందుకు సింగరేణి యాజమాన్యం సిద్ధమవుతోంది. ఈ విషయమై గతంలోనే సీఎండీ బలరామ్ హెచ్చరికలు జారీ చేయగా మంగళవారం సకాలంలో హాజరుకాని ఉద్యోగుల వివరాలను సేకరించారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఇంటికి వెళ్లిన 32 మంది ఉద్యోగులు తిరిగి రాలేదని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది వారి వివరాలను అధికారులకు అందజేశారు. ఈ విషయమై సీఎండీ బలరామ్ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, సమయపాలన పాటించని ఉద్యోగులు, అధికారులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వ్యక్తిగత పనులు ఉంటే సెలవు పెట్టాలే తప్ప సంతకాలు చేసి వెళ్తామంటే కుదరదని హెచ్చరించారు.

పీజీ సెట్ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్



నగేష్

పాల్వంచరూరల్: తెలంగాణ పీజీ సెట్ ఫలితాలు మంగళవారం విడుదల చేయగా, పాల్వంచ మండలం పాండురంగాపురానికి చెందిన ఆంగోత్ నగేష్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించాడు. గ్రామానికి చెందిన కేటీపీఎస్ ఉద్యోగి ఆంగోతు మంగీలాల్ - మంగమ్మ దంపతుల కుమారుడైన నగేష్ ఏడాది పాటు లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని పీజీ సెట్ రాయగా.. మైనింగ్ విభాగంలో 120 మార్కులకు 109 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఈపీ ఆపరేటర్ అభ్యర్థులకు పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఖాళీగా ఉన్న 68 ఈపీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి మంగళవారం డ్రైవింగ్ పరీక్ష నిర్వహించారు. ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాల కార్మికులకు కొత్తగూడెంలోని గౌతంపూర్‌లో పరీక్షలు నిర్వహించగా సెలక్షన్ కమిటీ కన్వీనర్ ఎం.కోటిరెడ్డి, ఏరియా జీఎం ఎం.శాలేంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. డ్రైవింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఈనెల 30న రాతపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మొదటిరోజు పరీక్షకు 79 మంది హాజరుకాగా 38 మంది ఎంపికయ్యారని చెప్పారు. ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు కోటిరెడ్డి, బి.శివకేశవరావు, ఎస్.యోహాన్, దుర్గాప్రసాద్, ముకుంద సత్యనారాయణ, ఎ.ఉపేందర్‌బాబు, శ్రావణ్‌కుమార్, మురళి, అజయ్‌కుమార్, సంఘమిత్ర, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రసాద్, ఉమర్‌ఫారూఖ్ పాల్గొన్నారు.

'ఇల్లెందు' సంగతేంటో ?

డీపీఆర్‌కు ఆమోదం లభించేనా..

- సీతారామ ప్రాజెక్టులో ఇల్లెందుకు అన్యాయం
- కొత్త ఆయకట్టు కేవలం 175 ఎకరాలే
- నియోజకవర్గానికి అదనపు లబ్ధి కోసం ప్రణాళిక
- రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఫైల్



టేకులపల్లి మండలం రోళ్లపాడులో సీతారామ పనులకు శంకుస్థాపన చేస్తున్న నాటి సీఎం కేసీఆర్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు తొలి అడుగు పడింది ఇల్లెందు నియోజవర్గంలోనే. ప్రాజెక్టుకు సంబంధించి ముందుగా ఖరారు చేసిన డీపీఆర్‌లో టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద భారీ రిజర్వాయర్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు 2016 ఫిబ్రవరి 16న అక్కడే ప్రాజెక్టు పనులకు నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. కానీ ఆ తర్వాత రిజర్వ్ ఫారెస్ట్, కిన్నెరసాని అభయారణ్యం, రైల్వే ట్రాక్‌లతో ఇబ్బందులు రావడంతో ప్రాజెక్టు స్వరూపాన్ని చాలా వరకు మార్చేశారు. ఫలితంగా ఇల్లెందు నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరిగింది. ప్రస్తుత ప్లాన్ ప్రకారం ఈ నియోజకవర్గంలో కేవలం 175 ఎకరాలకే సాగునీరు అందనుంది. దీంతో ఇల్లెందుకు న్యాయం చేసేలా సవరించిన ప్రతిపాదనలతో మరో డీపీఆర్‌ను సిద్ధం చేశారు.

ఆమోదం లభిస్తే..

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో ఇల్లెందు డీపీఆర్‌కు ఆమోదం లభిస్తే భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో కొత్తగా 1.16 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఇందులో ఇల్లెందు కాలువ ద్వారా 1,00,405 ఎకరాల భూమి ఉంది. ఇదే ప్రణాళికలో అశ్వాపురం మండలంలోని మార్లెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని కూడా చేర్చారు. దీని ద్వారా 16,796 ఎకరాలకు నీరందించే అవకాశం ఉంది. అంతేకాక ఇల్లెందుతో పాటు ఖమ్మం జిల్లా పరిధిలో వైరా, పాలేరు, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గాల్లోని పలు మండలాలకు నీరందనుంది. దీని కోసం రూ. 3,200 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

గ్రావిటీ ద్వారా..

సీతారామ తొలిదశలో కీలకంగా మారిన రోళ్లపాడు రిజర్వాయర్‌కు తిరిగి ప్రాధాన్యత దక్కింది. వివిధ దశల్లో ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలు జూలూరుపాడు కెనాల్ ద్వారా ఇల్లెందు శివారులోని సింగరేణి మండలంలో సముద్రమట్టం నుంచి 175 అడుగుల ఎత్తులో ఉన్న లలితాపురం చెరువుకు, అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా 216 అడుగుల ఎత్తులో ఉన్న రోళ్లపాడు రిజర్వాయర్‌కు చేరుకుంటాయి. ప్రస్తుతం రోళ్లపాడు రిజర్వాయర్ నీటి సామర్థ్యం 0.175 టీఎంసీలు కాగా, దీన్ని 10 టీఎంసీలకు పెంచే అవకాశం ఉంది. అక్కడి నుంచి రెండు కాల్వల ద్వారా టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. జూలూరుపాడు కెనాల్ - లలితాపురం ట్యాంక్‌ల ఆధారంగా రఘునాథపాలెం, సింగరేణి, ఖమ్మం అర్బన్ మండలాల్లోని గ్రామాలకు నీరు చేరేలా డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు తవ్వనున్నారు. దీంతో పాటు రోళ్లపాడు రిజర్వాయర్ నుంచి జిల్లాలోనే అత్యంత ఎత్తులో (267 అడుగులు) ఉన్న ఇల్లెందు మండలం రొంపేడు పరిసర ప్రాంతాలకు నీరు అందించనున్నారు.

ఇల్లెందు ప్లాన్‌తో సాగయ్యే ఆయకట్టు వివరాలిలా..

జిల్లా	నియోజకవర్గం	ఆయకట్టు (ఎకరాల్లో)
భద్రాద్రి కొత్తగూడెం	ఇల్లెందు	65,483
భద్రాద్రి కొత్తగూడెం	పినపాక	15,796
భద్రాద్రి కొత్తగూడెం	కొత్తగూడెం	500
ఖమ్మం	పాలేరు	7,299
ఖమ్మం	వైరా	25,524
ఖమ్మం	ఖమ్మం	1,336
మహబూబాబాద్	డోర్నకల్	263

కీలకంగా బయ్యారం చెరువు..

సీతారామ ప్రాజెక్టులో ఇల్లెందు నియోజకవర్గానికి సంబంధించి బయ్యారం పెద్ద చెరువు కీలకం కానుంది. ప్రస్తుతం ఈ చెరువు మత్తడి 16 అడుగులు ఉండగా నీటి నిల్వ సామర్థ్యం 0.40 టీఎంసీలు. దీంతో అలుగు ఎత్తును మరో మూడు అడుగుల మేర పెంచి నీటి నిల్వ సామర్థ్యాన్ని 1.50 టీఎంసీలకు పెంచాలని నిర్ణయించారు. బయ్యారం చెరువును ఆలంబనగా చేసుకుని మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. అయితే గతేడాది కాలంగా ఈ ఫైల్ రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నందున ఇల్లెందు డీపీఆర్‌కు ఆమోదం వచ్చేలా చూడాలని జిల్లావాసులు కోరుతున్నారు.

అగ్రికల్చర్ డ్రోన్లతో రక్షణ

- వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ఏర్పాట్లు
- సన్నాహక సమావేశంలో కలెక్టర్ జితేష్
- విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): గోదావరి వరదలు వస్తే ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం గోదావరి వరదలపై ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఈసారి ప్రయోగాత్మకంగా అగ్రికల్చర్ డ్రోన్లను ఉపయోగించనున్నట్లు తెలిపారు. డ్రోన్ ద్వారా తాడును బాధితులకు వేసి బయటకు లాగాలని సూచించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు, నాటు పడవలు, బోట్లు సిద్ధంగా ఉంచాలని అన్నారు. వచ్చే నాలుగు నెలల వరకు సరిపడేలా నిత్యావసరాలను నిల్వ ఉంచాలని డీఎస్‌ఓను ఆదేశించారు. ముంపు చర్యల పర్యవేక్షణకు సెక్టోరియల్, జోనల్ అధికారులను నియమిస్తామన్నారు. అత్యవసర సేవల కోసం హెలికాప్టర్‌ను ఉపయోగించుకునేలా హెలీప్యాడ్‌లు సిద్ధం చేయాలని చెప్పారు. వరదల సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని, ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేలా ముందస్తు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్‌లో 24 గంటలూ పనిచేసేలా ఫ్లడ్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలని, మండల, జిల్లాస్థాయిలో కూడా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని అన్నారు. వరదల సమయంలో ప్రసవాలకు ఇబ్బంది కలగకుండా గర్భిణులను ముందుగానే గుర్తించి ఆస్పత్రుల్లో చేర్పించాలన్నారు. ఈ మేరకు పీహెచ్‌సీల్లో ఈడీ క్యాలెండర్ అందుబాటులో ఉంచాలని, లేదంటే వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. పాము, తేలుకాటు వంటి వాటికి వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని, వ్యాక్సిన్ లేక ప్రాణ నష్టం జరిగితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వరదల సమయంలో సేవల కోసం సింగరేణి, కేటీపీఎస్, ఐటీసీ, నవభారత్ తదితర సంస్థల రెస్క్యూ టీమ్‌ల జాబితా సిద్ధంగా ఉంచాలన్నారు. వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. గొత్తికోయల ఆవాసాల్లో పర్యటించి ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యల కోసం అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని, బ్లీచింగ్, సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని స్ప్రే చేయాలని చెప్పారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా చూడాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ప్రతీ గ్రామంలో ఈనెల 21 నాటికి ట్యాంకులను శుభ్రం చేయలన్నారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీడీఓలు

కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను పలువురు ఎంపీడీఓలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారిలో విజయభాస్కర్ రెడ్డి, ధన్‌సింగ్, కరుణాకర్ రెడ్డి, తేలూరు శ్రీనివాసరావు, అశోక్ తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి వేల్పుల విజేత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు వివరాలను http://kothagudem.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు. దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, విద్యార్హతకు సంబంధించిన జిరాక్స్ సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారి సంతకంతో ఈనెల 19 నుంచి 25 వరకు తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం మరో పోరాటం

టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ



మాట్లాడుతున్న అల్లం నారాయణ, పక్కన యూనియన్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనతో పాటు అక్రిడిటేషన్లు, జర్నలిస్టుల సంక్షేమ నిధి, హెల్త్ కార్డుల సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ పిలుపునిచ్చారు. ఖమ్మంలో మంగళవా రం జరిగిన యూనియన్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల స్థాయి సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్‌రావుతో కలిసి మాట్లాడారు. మీడియా అకాడమీ చైర్మన్‌గా తాను ఉన్న సమయాన రూ.100 కోట్లతో జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు చేసుకోగా, రూ.15 కోట్లతో మీడియా అకాడమీ భవనం నిర్మించామన్నారు. ఈమేరకు ఖమ్మంలో జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యపై మరో ఉద్యమం చేపట్టాలని సూచించారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడగా రాష్ట్ర నాయకులు యోగానంద్, మేకల కళ్యాణ్‌చక్రవర్తి, రమేష్ హజారి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమణకుమార్, జిల్లా కార్యదర్శి చిర్రా రవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లోజు శ్రీనివాస్, షఫీతో పాటు బొల్లం శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, లింగయ్య, శెట్టి రజనీకాంత్, వనం నాగయ్య, మందుల ఉపేందర్, పిన్ని సత్యనారాయణ, ఉదయ్, శ్రీధర్‌శర్మ, గుద్దేటి రమేష్, ఎలమందల జగదీష్, అశోక్, జల్ది శ్యామ్, నాగరాజు, భారతి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కుటుంబ సభ్యులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తిరుమలలో మంత్రి తుమ్మల

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం కుటుంబ సమేతంగా తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలు తెలుగుజాతి ఔన్నత్యం, కీర్తిని కాపాడుకుంటూ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ముందు నిలవాలని స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.

– ఖమ్మంవన్‌టౌన్

రుణమాఫీకి రెడీ..

- దశల వారీగా రైతుల పంట రుణాల మాఫీ
- ఆగస్టు 15 నాటికి పూర్తిచేసేలా ప్రణాళిక
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- ఉమ్మడి జిల్లాలో 5.58 లక్షల మంది రైతుల ఆశలు



ఇదే అదును

ఖమ్మంవ్యవసాయం : రైతుల పంట రుణాలను మాఫీ చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అసెంబ్లీ ఎన్నికల సమయాన రూ.2 లక్షల వరకు రైతుల పంట రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ అంశంపై ప్రకటన చేశారు. ఈనేపథ్యాన ఆగస్టు 15నాటికి అర్హులందరికీ రుణాలు మాఫీ చేసేందుకు కసరత్తు ప్రారంభించిన ప్రభుత్వానికి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సమర్పించారు. 2023 డిసెంబర్ 12 నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 5.58 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల నుంచి రూ.6,123 కోట్ల మేర పంట రుణాలను తీసుకున్నట్లు లీడ్ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో ఎందరు మాఫీకి అర్హత సాధిస్తారనే అంశం ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాల ఆధారంగా తేలనుంది.

వానాకాలం సీజన్ ఇప్పుడిప్పుడే మొదలవుతుండగా రైతులు పంటల సాగుకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే మెట్ట పంటల విత్తనాలు కూడా నాటుతున్నారు. జూలై నాటికి పంటల సాగు ముమ్మరం కానుండడంతో పెట్టుబడి కోసం రైతులు అప్పు లభించే మార్గాలను వెదుక్కుంటున్నారు. కొందరు బ్యాంకుల్లో తమ పాస్ బుక్‌ల ఆధారంగా రుణాలను తీసుకోనుండగా.. ఇంకొందరు ఎరువులు, పురుగుమందుల దుకాణాల యజమానులు, కమీషన్ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకుంటారు. ఈ సమయాన పంట రుణాలను మాఫీ చేస్తే తిరిగి అదే బ్యాంకులు రుణం ఇచ్చే అవకాశం ఉండడంతో ప్రభుత్వం త్వరగా నిర్ణయం వెలువరించాలని అన్నదాతలు కోరుతున్నారు.

రూ.50వేల నుంచి మొదలు...

రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా వంటి కార్యక్రమాలకు రూ.వేల కోట్ల నిధులు అవసరముండడంతో ప్రభుత్వం రుణమాఫీని దశల వారీగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. 2023 డిసెంబర్ 12నాటికి పొందిన పంట రుణాల్లో మొదటగా రూ.50 వేల వరకు..ఆపై రూ.75 వేలు, ఆతర్వాత రూ.లక్ష, అనంతరం రూ.2లక్షల రుణాన్ని మాఫీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ కార్యక్రమాన్ని జూలై 15 నుంచి దశల వారీగా అమలుచేస్తారని తెలిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.50 వేల లోపు పంట రుణాలు పొందిన వారు 1.20 లక్షల మంది, రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు 3 లక్షల మంది, ఇక రూ.లక్ష నుంచి రూ.2లక్షల పంట రుణాలు పొందిన వారు 1.38లక్షల మంది ఉంటారని అంచనా. ప్రధానంగా డీసీసీబీ ద్వారా 1.75 లక్షల మంది రైతులకు రూ.882.12 కోట్లు, ఏపీజీవీబీ నుంచి 1.25 లక్షల మందికి రూ.1,394 కోట్ల మేర పంట రుణాలు ఇచ్చారు.

వారు మినహా...

రుణమాఫీపై అధికార యంత్రాంగం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. భూమి పాస్‌బుక్‌లు, రేషన్ కార్డులు ఉన్నవారికే వర్తింపజేయాలని అందులో చేర్చినట్లు సమాచారం. ఇక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు, ఉద్యోగులను మినహాయించాలని సూచించినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం మంత్రి మండలిలో చర్చించాక నిర్ణయం వెలువరించనుంది. కాగా, 2018 డిసెంబర్ 12 నుంచి తీసుకున్న పంట రుణాలు, రెన్యూవల్ చేసుకున్న రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించి బ్యాంకుల నుంచి జాబితాలు తెప్పించుకున్నట్లు సమాచారం.

2023 డిసెంబర్ 12నాటికి రైతుల పంట రుణ వివరాలు	జిల్లా	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం
	రైతులు	3,73,157	1,85,034
	రుణాలు (కోట్లు)	రూ.4,307.58	రూ.1,816.35

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన రేషన్ డీలర్లు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

అశ్వాపురం: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జితేశ్.వి.పాటిల్‌ను రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. 200 నోట్‌బుక్స్, పెన్నులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు మహేశ్, చంద్రం, రాజయ్య, శ్రీను, కృష్ణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థిని ప్రతిభ



శ్రీతేజ

భద్రాచలంటౌన్/కరకగూడెం: భద్రాచలం గిరిజన గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తోలెం శ్రీతేజ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన 19వ నేషనల్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న ఆమె రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కరకగూడెం మండలంలోని కొత్తగూడెంనకు చెందిన తోలెం వెంకటేశ్వర్లు – మల్లీశ్వరి దంపతుల కుమార్తె శ్రీతేజను గిరిజన గురుకులాల సెక్రటరీ కె.సీతామహాలక్ష్మి, ప్రాంతీయ సమన్వయ అధికారి తుమికి వెంకటేశ్వరరాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు తదితరులు అభినందించారు.

లేబర్ కోడ్లపై 23న రాష్ట్ర స్థాయి సదస్సు

ఇల్లెందు/ఇల్లెందురూరల్: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇల్లెందు మండలంలోని పెంకు పరిశ్రమల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కార్మిక ప్రయోజనాలకు తోడ్పడేలా ఉన్న 29 లేబర్ చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి, వీటి స్థానంలో కార్పొరేట్ల ప్రయోజనాల పరిరక్షణకు నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ అంశంపై కార్మికులకు అవగాహన కల్పించేందుకు ఈనెల 23న మహబూబాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని శ్రీనివాస్ కోరారు. ఈసమావేశంలో నాయకులు జె.సీతారామయ్య, ఎం.ఏసు, ఏపూరి వీరభద్రం, నాగేశ్వరరావు, శేషు, బజారి, రమేష్, రాంబాబు, రవి, సురేష్ పాల్గొన్నారు.

జెడ్పీ ఉద్యోగి కుటుంబానికి రూ.15లక్షల పరిహారం



శ్రీకృష్ణ (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): లోక్‌సభ ఎన్నికల్లో అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్(ఏపీఓ)గా విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మృతి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ ఉద్యోగి పోలూరి శ్రీకృష్ణ(55) కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. జెడ్పీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీకృష్ణ గత నెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అశ్వారావుపేట మండలం పేరాయిగూడెంలోని పోలింగ్ బూత్‌కు ఏపీఓగా నియమితులయ్యారు. ఆయన విధుల్లో ఉండగానే తీవ్ర అస్వస్థతకు గురికాగా, పక్కనే ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లారు. అయితే, సరైన మందులు లేకపోవడంతో సిబ్బంది ఏమీ చేయలేకపోయారు. ఆ కాసేపటికి వచ్చిన డాక్టర్ పరీక్షించి అప్పటికే శ్రీకృష్ణ గుండెపోటుతో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సమయాన మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు మంగళవారం పరిహారం ప్రకటించగా శ్రీకృష్ణ కుటుంబానికి సైతం రూ.15 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు తల్లాడలో కౌలు రైతుల రాష్ట్ర సదస్సు



మాట్లాడుతున్న రాంబాబు

వైరా: కౌలు రైతుల రాష్ట్రస్థాయి సదస్సును బుధవారం తల్లాడలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. వైరాలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత, ప్రస్తుత ప్రభుత్వాలు కౌలు రైతుల సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ కౌలు రైతులకు భరోసా ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు స్పందన లేదని తెలిపారు. పోరాట కార్యాచరణ రూపొందించేందుకు తల్లాడ వాసవీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, రామకృష్ణ, మైకెల్ పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

అటవీ అధికారులు ఏం చేస్తున్నట్లు?

- కలప అక్రమ రవాణా కేంద్రంగా ఇల్లెందు సబ్ డివిజన్!
- ఉద్యోగుల సస్పెన్షన్‌తోనూ కనిపించని మార్పు
- తాజాగా మరోసారి వెలుగుచూసిన కలప అక్రమ రవాణా



పెద్దతోగులో వేర్లతో కూడిన మోడు నుంచి కొలతలు సేకరిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: అటవీ శాఖ ఇల్లెందు సబ్‌డివిజన్ కలప అక్రమ రవాణాకు కేంద్రంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటున్నా కలప అక్రమ రవాణా పునరావృతం కావడం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపాన్ని బహిర్గతం చేస్తోంది. ఏడాది కిందట గుండాల మండలం కాచనపల్లి రేంజ్ పరిధిలోని నారవేప కలప మాయమైన ఆరోపణలతో జగ్గుతండా బీట్ అధికారి హనుమంతు.. కలప అక్రమణ రవాణాకు సంబంధించి డీఆర్‌ఓ బేగం, మరిదరు కొందరు సిబ్బంది సస్పెండైన సంగతి తెలిసిందే. అంతే కాకుండా ఏడాదిన్నర కిందట ఇల్లెందు రేంజ్ అధికారి రవికిరణ్, డీఆర్‌ఓలు సుక్కి, జయరాం, బీట్ అధికారి ఒకరు అవినీతి ఆరోపణలతో, జేకేటీ నిర్వాసిత ప్రాంతంలో చోటుచేసుకున్న అక్రమాల ఆరోపణలతో 10 నెలల కిందట ఇల్లెందు రేంజ్ ధర్మాపురం బీట్ అధికారి చందులాల్ సస్పెన్షన్‌కు గురైన విషయమూ విదితమే. అంతకుముందు పలువురు బీట్, సెక్షన్, రేంజ్ అధికారులపై వెల్లువెత్తిన పలు అవినీతి ఆరోపణలపై విచారణలు జరిగాయి. క్షేత్రస్థాయి నుంచి డివిజన్, జిల్లాస్థాయి వరకు బలమైన పర్యవేక్షణ చేసే అధికారుల బృందం ఉన్న అటవీశాఖపై ఈ స్థాయిలో అవినీతి ఆరోపణలు వెలుగు చూడటం చర్చనీయాంశంగా మారింది.

కలప రవాణాపై విచారణ

కాచనపల్లి రేంజ్ పరిధిలోని పెద్దతోగు బీట్ నుంచి టేకు కలప అక్రమంగా రవాణా జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ట్రైనీ ఐఎఫ్ఎస్, కాచనపల్లి ఇన్‌చార్జ్ రేంజ్ అధికారి రేవంత్ చంద్ర, డీఆర్‌ఓ సీతారాములు మంగళవారం విచారణ చేపట్టారు. కలప సేకరించిన ప్రాంతాన్ని పరిశీలించి పోడు భూమిగా నిర్ధారించారు. ఎన్ని చెట్ల నుంచి కలప సేకరించారు.. యార్డ్‌కు చేరిన కలప దిమ్మలు, వాటి సైజుల వివరాలతో సరిచూశారు. కలప రవాణాకు సంబంధించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడం బీట్ అధికారి చేసిన తప్పిదంగా అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. పెద్దతోగు నుంచి ఆదివారం సాయంత్రమే బయలుదేరినప్పటికి సోమవారం తెల్లవారుజాము సమయంలో కొమరారానికి చేరుకోవడానికి గల కారణాలను అధికారులు ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉండగా ట్రైనీ ఐఎఫ్ఎస్ రేవంత్ చంద్ర పర్యవేక్షణలో చేపట్టిన విచారణ నివేదికను ఇల్లెందు ఎఫ్‌డీఓ వెంకన్నకు అందజేశారు.

పెద్దతోగులో ఏం జరిగిందంటే..

కాచనపల్లి రేంజ్ పరిధిలోని పెద్దతోగు బీట్‌లో బీట్ అధికారి నిర్మల పోడు భూమిలో నేలవాలిన టేకు కలపను సైజులు కట్ చేయించి ట్రాక్టర్‌లో నేరుగా ఇల్లెందు కలప యార్డ్‌కు తరలించే ప్రయత్నం చేసింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియకుండా గోప్యత పాటించడం వెనుక మరో కారణం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ రేంజ్ పరిధిలో రెండేళ్ల కిందట కలప అక్రమ రవాణాకు సంబంధించి వచ్చిన ఆరోపణలతో అప్పటి డీఆర్‌ఓ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ ఘటనలో ప్రస్తుత పెద్దతోగు బీట్ అధికారి నిర్మలపై కలప రికవరీ ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే గతంలో చేసిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు తాజాగా పోడు భూముల్లో నేలవాలిన టేకు కలపను కలప యార్డుకు గుట్టుగా తరలించి గతంలో ఉన్నతాధికారులు జారీ చేసిన రికవరీ కింద తాజాగా తరలించిన కలపను చూపించేలా బీట్ అధికారి వ్యూహం రచించినట్లు ప్రచారంలో ఉంది. అయితే మార్గమధ్యలో అర్ధరాత్రి నిఘా నేత్రాల కంట పడటంతో సుమారు మూడు గంటల పాటు చర్చలు జరిగిన కారణంగా కలప తరలింపులో ఆలస్యం చోటుచేసుకోవడం, నిఘా నేత్రాల నుంచి వారి సహచరులకు సమాచారం అందడం.. అది కాస్త అటవీశాఖ అధికారులకు చేరడంతో కొమరారం రేంజ్ పరిధిలో ట్రాక్టర్‌ను పూర్తిగా అటవీశాఖ డీఆర్‌ఓ సీతారాములు పర్యవేక్షణలో కలపయార్డుకు చేరినట్లుగా ప్రచారంలో ఉంది. అయితే నిఘానేత్రాల అడ్డగింతతో అప్రమత్తమైన బీట్ అధికారి ఎవరికీ అనుమానం రాకూడదని ఎరుపు రంగులో కలపపై నంబర్లు వేసి గతంలో కేసు నమోదు చేసిన కలపగా చూపించే ప్రయత్నం చేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కోణంలో అటవీశాఖ అధికారుల విచారణ కూడా జరిగినట్లుగా సమాచారం.

నామమాత్రపు చర్యలతోనే..

డివిజన్ స్థాయి, జిల్లాస్థాయి అధికారులతో పాటు రాష్ట్రస్థాయిలో వివిధ హోదాల్లో ఉన్న ఉన్నతాధికారులు సైతం అడవుల తనిఖీ పేరుతో పలు దఫాలుగా ఇల్లెందు డివిజన్ పరిధిలో పర్యటిస్తుంటారు. ఆయా అధికారులు తమ పర్యటనలలో ఏం పరిశీలిస్తున్నారో కానీ.. అక్రమాలు మాత్రం ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. మూడేళ్లుగా ఇల్లెందు డివిజన్ పరిధిలో వెలుగుచూసిన అక్రమాలు అటవీశాఖ అధికారులు స్వయంగా గుర్తించినవి కాకపోవడం గమనార్హం. ఒకవేళ తప్పు జరిగినట్లు తెలిసినా నామమాత్రపు చర్యలే ఉండటం, వెనువెంటనే విధుల్లో చేరుతుండటంతో ఇల్లెందు ఏజెన్సీలో అక్రమాలు తరచూ జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



అటవీశాఖలో ప్రతిబీట్‌పై పర్యవేక్షణ ముమ్మరం చేస్తాం. డివిజన్ పరిధిలో సిబ్బంది, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవు. కాచనపల్లి రేంజ్ పరిధిలో బీట్ అధికారి నిర్మలపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుగుతోంది. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– కర్నావత్ వెంకన్న, ఎఫ్‌డీఓ,

నేడు, రేపు టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర మహాసభలు

ఏర్పాట్లను పరిశీలించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు దేవులపల్లి అమర్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజే-ఐజేయూ) రాష్ట్ర మూడో మహాసభలు బుధ, గురువారం ఖమ్మంలో జరగనున్నాయి. ఖమ్మంలోని ఉషా కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న సభల ఏర్పాట్లను మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆతర్వాత ఈ హాల్‌లోనే జరిగిన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంలో సభల సన్నద్ధతపై సమీక్షించిన ఆయన ఏర్పాట్లపై సూచనలు చేశారు. సభలను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనుండగా, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, యూనియన్ జాతీయ నాయకులే రాష్ట్రంలోని అన్ని జిల్లాల కార్యవర్గ బాధ్యులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ నేపథ్యాన వసతి, ఇతర అంశాల్లో ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఈసమావేశంలో ఐజేయూ పూర్వ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, రాష్ట్ర అధ్యక్ష కారదర్శులు నగునూరి శేఖర్, విరాహత్ అలీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావుతో పాటు కె.రాంనారాయణ, వెంకట్రావు, శ్రీనివాసరావు, మురారి, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడను కలిసిన చైర్మన్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు – విజయలక్ష్మి దంపతుల ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. కాగా, మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాసరెడ్డిని పువ్వాడ అభినందించారు.

నిషేధిత గడ్డిమందు పట్టివేత

- అనుమతి ఉందంటున్న తయారీ కంపెనీ
- విచారణకు ఆదేశించిన వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు



పట్టుకున్న గ్లైసిల్ మందు డబ్బాలతో అధికారులు

భద్రాచలంటౌన్/అశ్వాపురం : రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ అనే గడ్డి మందును తరలిస్తుండగా భద్రాచలం అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద అధికారులు మంగళవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. 200 లీటర్ల గ్లైసిల్ గడ్డి మందును వరంగల్ నుంచి అశ్వాపురం మండలంలోని ఓ డీలర్‌కు సరఫరా చేస్తున్నారు. ఆ వ్యాన్‌లో ఇతర రకాల పురుగుమందులు కూడా ఉండడంతో వాటిని ములుగు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో డీలర్లకు అందించి గ్లైసిల్‌ను అశ్వాపురానికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద వ్యవసాయ అధికారులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తుండగా నిషేధిత గడ్డి మందును గమనించారు. దీంతో వాహనాన్ని అదుపులోకి తీసుకుని, అందులో ఉన్న వ్యక్తిని విచారించారు. మందు విలువ రూ.67 వేలు ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కాగా, ఈ మందును ప్రభుత్వం పూర్తిగా నిషేధించలేదని, వరి వంటి ఆహార పంటలకు కాకుండా కొన్ని వృక్ష జాతి మొక్కలకు వినియోగించవచ్చని, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మందు తయారు చేస్తున్నామని, తమకు హైకోర్టు నుంచి కూడా అనుమతి ఉందని స్వాల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ వారు చెబుతున్నారని పోలీసులు వివరించారు. దీంతో ఈ మందును ఏయే పంటలకు వినియోగించేందుకు తీసుకెళ్తున్నారనే కోణంలో విచారణ చేస్తున్నామని వ్యవసాయ, పోలీస్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు వివరాలు సేకరించాలని అశ్వాపురం మండల ఏఓను ఆదేశించారు. పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాకే కేసు నమోదు చేస్తామని భద్రాచలం ఏఓ అనిల్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి

వివాహేతర సంబంధం అనుమానంతోనే..



ఉపాధ్యాయుడిని చెట్టుకు కట్టేసిన దృశ్యం

అశ్వారావుపేటరూరల్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయుడు ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో ఆమె బంధువులు చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసిన ఘటన అశ్వారావుపేట మండలం నెమలిపేటలో చోటుచేసుకుంది. స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు లావుడ్యా రాందాస్ కొంతకాలంగా ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఆమె బంధువులు మంగళవారం పాఠశాల కు చేరుకుని రాందాస్‌ను బయటకు తీసుకొచ్చి చెట్టు కు కట్టేశారు. ఆ తర్వాత వివాహితను కూడా అక్కడికి తీసుకొచ్చి ఇద్దరిపై దాడి చేశారు. ఈ ఘటనపై అశ్వారావుపేట ఎంఈఓ పి.కృష్ణయ్య ఇచ్చిన సమాచారంతో పోలీసులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు తీసుకెళ్లగా.. ఇరువర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. అయితే, లిఖితపూర్వకంగా తమకు ఫిర్యాదు అందలేదని, దీనిపై వివరాలు సేకరిస్తున్నామని ఎస్‌ఐ శ్రీను తెలిపారు. కాగా, ఈ ఘటనపై కాంప్లెక్స్ హెచ్ఎంలు ఆర్.పద్మావతి, శేషమ్మ సైతం విచారణ చేపట్టగా నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం, కాకర్ల గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, కాపర్ వైర్ అపహరించారు. మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీశ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. చోరీ చేసిన కాపర్ వైర్ విలువ రూ.70 వేలు ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని ఏఈ పేర్కొన్నారు.

విత్తనాలు, ఎరువుల సరఫరాలో విఫలం



మాట్లాడుతున్న వి.కోటేశ్వరరావు

ఇల్లెందు: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయటంలో విఫలమైందని చెందిందని న్యూడెమోక్రసీ అనుబంధ ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. అవసరమైన రైతులకు కొత్త రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా తుపాకుల నాగేశ్వరరావు, బట్టు ప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే ఉమర్, సహాయ కార్యదర్శిగా కుంజా కృష్ణ, కోశాధికారిగా జక్కుల రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులుగా గుగులోతు రాంచందర్, పూనెం రంగయ్య, ఎట్టి నర్సింహారావు, సూర్దపాక నాగేశ్వరరావు, వల్లోజు రమేశ్, కల్తీ సీతారాములు, గొగ్గెల రాజు తదితరులు పాల్గొన్నారు.

30 నాగుపాము పిల్లల పట్టివేత



పాము పిల్లలతో స్నేక్ రెస్క్యూ టీం, ప్లాస్టిక్ డబ్బాలో ఉన్న పాము పిల్లలు

కొత్తగూడెంఅర్బన్: వర్షకాలంలో విషసర్పాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు, స్నేక్ రెస్క్యూ టీం సభ్యులు సూచించారు. కొత్తగూడెం పట్టణ పరిధి నెహ్రూబస్తీకి చెందిన రాజు ఇంట్లో పాము పిల్లలు కనిపించడంతో స్నేక్ రెస్క్యూ టీం బలరాం(దద్దు)కు సమాచారం అందించారు. దీంతో బలరాం, సహచరుడు పెద్దిరాజు కలిసి రాజు ఇంటికి వెళ్లి 30 వరకు నాగుపాము పిల్లలను పట్టుకున్నారు. అన్ని పాము పిల్లలు దొరకడంతో ఇంట్లోని వారు, స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. పాము పిల్లలన్నింటినీ అటవీశాఖ అధికారులకు అప్పగిస్తామని బలరాం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మహాలక్ష్మడు (ఫైల్)

దమ్మపేట: ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో కిందపడిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గుర్వాయిగూడెం గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేటకు చెందిన పెరుమాళ్ల మహాలక్ష్మడు (50) తన ద్విచక్ర వాహనంపై పట్వారిగూడెం గ్రామం వైపునకు కూలీ కోసం వెళ్తున్నాడు. గుర్వాయిగూడెం గ్రామ శివారులోని మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడింది. మహాలక్ష్మడు రోడ్డు పక్కన పొదల్లో పడిపోయాడు. ఆయన తలకు తీవ్రగాయం కాగా స్థానికులు దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన అప్పటికే చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

మణుగూరులో యువకుడు..

మణుగూరుటౌన్: రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సమితిసింగారానికి చెందిన దేవళ్ల మహేశ్ (19).. తన స్నేహితుడు రాహుల్‌తో కలిసి మణుగూరు అంబేడ్కర్ సెంటర్‌కు వచ్చి ఇంటికి వెళ్తున్నాడు. సమితి సింగారం ప్రాంతంలో మరో ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి ఎదురుగా రావడంతో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన మహేశ్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి దేవళ్ల శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు...



ప్రకాశ్ (ఫైల్)

కారేపల్లి: కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలంలోని మేకలతండా గ్రామానికి చెందిన లావుడ్యా ప్రకాశ్(20) ట్రాలీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, ఆయన తల్లి చిన్నతనంలోనే మృతి చెందాడు. అలాగే, తండ్రి వీరన్న ఓ కేసులో పదేళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తుండడంతో ప్రకాశ్ నానమ్మ శాంతమ్మ వద్ద జీవిస్తున్నాడు. ఈమేరకు మద్యానికి బానిసైన ఆయన ఈనెల 1వ తేదీన మత్తులో పురుగుల మందు తాగగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడని, కుటుంబీల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్.రాజారాం తెలిపారు.

రెండు చోట్ల పిడుగుపాటు



పిడుగుపడటంతో దగ్ధమవుతున్న తాటిచెట్టు

చర్ల: మండలంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలం కేంద్రంలోని విజయకాలనీ, లింగాపురంపాడు ప్రాంతాల్లో కొబ్బరి, తాటి చెట్లపై పిడుగుపడటంతో అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. పరిసర ప్రాంత ప్రజలు పిడుగుల శబ్దానికి భయాందోళనకు గురయ్యారు.

పిడుగు పడి రెండు ఎద్దులు మృతి

అశ్వాపురం: మండలంలోని తురుమలగూడెం గ్రామంలో పిడుగుపాటుతో రెండు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గుగులోత్ శ్రీనుకు చెందిన రెండు ఎద్దులు మంగళవారం రాత్రి సమయంలో పిడుగుపడటంతో మృత్యువాత పడ్డాయి. ఎద్దులతోనే పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని.. ప్రభుత్వం ఆర్థికసాయం చేసి తమను ఆదుకోవాలని రైతు బోరున విలపించాడు.

కొమరారంలో వ్యాపారి వాట్సాప్ హ్యాక్

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన వ్యాపారి ప్రేంకుమార్ వాట్సాప్ అకౌంట్ మంగళవారం హ్యాక్ అయ్యింది. గుర్తుతెలియని వ్యక్తులు అకౌంట్‌ను హ్యాక్ చేసి ప్రేంకుమార్ పేరు, ఆయన సెల్‌నంబర్‌తో ఎస్‌బీఐ బ్యాంకు యూనో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు సమాచారం. ఆపై లింక్‌కు అప్‌లోడ్ చేయడం మొదలుపెట్టగా, ఈ మెస్సేజ్‌ను క్లిక్ చేస్తే సదరు వ్యక్తుల అకౌంట్ నుంచి డబ్బు డ్రా అయ్యే అవకాశం ఉందని తెలిసి తిరిగి ప్రేంకుమార్‌కు ఫోన్‌చేశారు. ఈ మేరకు ఆయన కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్‌ను ఆశ్రయించి ఆయన సూచనలతో సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కోడలిపై దాడి ఘటనలో హెడ్ కానిస్టేబుల్‌పై కేసు

బోనకల్: గుండె కుడివైపు ఉందనే కారణంతో మహిళను ఆమె భర్త వేధించగా, ప్రశ్నించినందుకు ఆమెపై దాడి చేసిన మామ, హెడ్‌కానిస్టేబుల్ టి.వెంకటేశ్వర్లు, అత్త అన్నపూర్ణపై కేసు నమోదు చేసినట్లు బోనకల్ ఎస్‌ఐ మధుబాబు తెలిపారు. బోనకల్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లు పెద్ద కుమారుడు భాస్కరాచారికి ఖమ్మంకు చెందిన భవానీతో 2018లో వివాహం జరిగింది. అయితే, భవానీకి గుండె కుడివైపు ఉందనే కారణంతో భర్త, అత్తామామలు వేధిస్తున్నారు. ఈనేపథ్యాన భవానీ బోనకల్‌లో నివాసముంటున్న వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లగా ఈనెల 14న వెళ్లగా మాటామాట పెరగడంతో ఆమెపై అత్తామామలు దాడి చేశారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బూర్గంపాడు: సారపాకకు సమీపంలో గోదావరి బ్రిడ్జి కింద ఇసుకలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగభిక్షం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి సుమారు 60 ఏళ్ల వయసు ఉంటుందని, యాచకుడని భావిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.